# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

పత్రికా ప్రకటన

**జూలై 8, 2012**

### దక్షిణ బస్తర్‌లోని బాసగూడ, జేగుర్‌గొండ ప్రాంతాలలో ప్రభుత్వ సాయుధ బలగాలు సాగించిన ఆదివాసుల నరమేధాన్ని ఖండించండి! దేశ సంపదల్ని కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టే కుట్రలో భాగంగా ఫాసిస్టు పాలకవర్గాలు ప్రజలపై సాగిస్తున్న యుద్ధం – ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను అడ్డుకోవడానికి ముందుకు రండి!

'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో గత మూడేళ్లుగా సోనియా–మన్మోహన్–చిదంబరం–ప్రణబ్ ముఖర్జీ–జయరాం రమేష్ పాలక ముఠా నాయకత్వంలో దోపిడీ పాలకవర్గాలు ప్రజలపై సాగిస్తున్న అన్యాయమైన యుద్ధంలో భాగంగా జూన్ 28–29 తేదీల మధ్య రాత్రి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, ఊసూరు బ్లాక్‌కు చెందిన బాసగూడ పోలీసు స్టేషన్ పరిసర గ్రామమైన సార్కిన్‌గూడలో అత్యంత పాశవిక దాడికి పాల్పడ్డాయి. బీజాపూర్, సుక్మా జిల్లాల నుండి ఏకకాలంలో బయలుదేరిన సాయుధ బలగాలు ఘోర నరమేధానికి పాల్పడ్డాయి. సీఆర్‌పీఎఫ్– కోబ్రా, రాష్ట్ర పోలీసు బలగాలు, కోయ కమాండోలు దాదాపు వెయ్యి మంది లైసెన్స్‌డ్ హంతకులు ఈ ప్రాంత గ్రామాలపై విరుచుకుపడ్డారు. తమ సామాజిక జీవనంలో భాగంగా పంటల గురించి, పండుగల గురించి చర్చించుకోవడానికి గ్రామం నడి మధ్యలో సమావేశమైన మూడు గ్రామాల ప్రజలను నాలుగు వైపుల నుండి చుట్టుముట్టి నిర్విచక్షణగా, ఏకపక్షంగా జరిపిన కాల్పుల్లో అనేక మంది అక్కడికక్కడే మరణించారు. మరెందరో గాయపడ్డారు. తెల్లవార్లూ ప్రభుత్వ కిరాయి హంతకులు గ్రామంలో వీరంగమాడుతూ ఇళ్లల్లో జొరబడి మరి కొందరిని కాల్చి చంపారు. మహిళలపై లైంగిక దాడులకు, అనేక ఇండ్లల్లో దోపిడీకి పాల్పడ్డారు. గాయపడ్డ వాళ్లు రక్తం మడుగులో కొట్టుమిట్టాడుతుంటే వాళ్లకు నీళ్లయినా ఇవ్వకుండా, ఇవ్వడానికి ప్రయత్నించిన కుటుంబ సభ్యులను బైటికి వస్తే కాల్చి చంపుతామని బెదిరించారు.

చనిపోయిన వాళ్లలో సార్కిన్‌గూడకు చెందిన వాళ్లు ఐదుగురు, కొత్తగూడకు చెందిన వాళ్లు 9 మంది, రాజుపేట గ్రామం వాళ్లు ముగ్గురు – మొత్తం 17 మంది వున్నారు. మరెందరో గాయపడ్డారు. చనిపోయిన వాళ్లలో తొమ్మిది మంది 12–16 ఏళ్ల మధ్య వయస్సు గల పసివాళ్లు. గాయపడ్డ వాళ్లలో కూడా పిల్లలు, వృద్ధులు, మహిళలు వున్నారు. మిగతా వాళ్లంతా చెల్లాచెదురయ్యారు. అదే రోజు సుక్మ జిల్లా, కొంట బ్లాక్, జేగుర్‌గొండ పోలీసు స్టేషన్ పరిధిలోని సిమ్లిపెంట గ్రామంలో ఇద్దరు ఆదివాసీ రైతుల్ని ప్రభుత్వ సాయుధ బలగాలు కాల్చి చంపాయి. ఈ దారుణ మారణకాండను కప్పిపుచ్చుకోవడానికి ఎప్పటి లాగే ఎన్‌కౌంటర్ అనే అబద్ధాన్ని అల్లి సాయుధ నక్సలైట్లు తమపై పొంచి వుండి దాడి చేయగా జరిగిన ఎదురుకాల్పుల్లో వీళ్లంతా చనిపోయారని మీడియా ద్వారా ప్రచారం సాగించారు. సంఘటనా స్థలం నుండి కొన్ని ఆయుధాలను, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు బూటకపు ప్రకటన చేశారు. దీన్ని నిజమని నమ్మించడానికి మావోయిస్టులు జరిపిన కాల్పులలో ఆరుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు గాయపడ్డట్టు మరో కట్టుకథనల్లారు. కాని క్రాస్‌ఫైర్‌లోనే వాళ్లకు గాయాలు అయి వుంటాయి తప్ప అక్కడ అసలు ఎదురుకాల్పులు జరగనే లేదని ప్రజలు, సంఘటనా స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన వాళ్లంతా ఘోషిస్తున్నారు.

మరుసటి రోజు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు సీఈఓగా వ్యవహరిస్తున్న కేంద్ర హోంమంత్రి చిదంబరం 'ఇది ముందస్తు సమాచారంపై ఆధారపడి పథకం ప్రకారం చేసిన దాడి' అని ప్రకటించి తన హంతక బలగాల వెన్ను తట్టాడు. ఈ నరమేధం జరిగిన వెంటనే బాసగూడ పరిసర గ్రామాల ప్రజలు రోడ్లపైకి వచ్చి ఇది హత్యాకాండ అనీ, చనిపోయిన వాళ్లంతా సాధారణ గ్రామస్తులనీ, అక్కడ మావోయిస్టులెవరూ లేరనీ, ఎదురుకాల్పులు జరగనే లేదనీ స్పష్టంగా ప్రకటించారు. మీడియాలో మృతుల ఫోటోలు చూసినవాళ్లెవరైనా చనిపోయిన వాళ్లెవరో స్పష్టంగా అర్థం చేసుకోగల్గుతారు. కానీ గోబెల్స్‌కు అచ్చమైన భారతీయ వారసులైన చిదంబరం, రమన్‌సింగ్, ననకీరాం, విజయ్‌కుమార్, అనిల్ నవానీ, రామ్‌నివాస్, లాంగ్‌కుమేర్ తదితర మంత్రులు, అధికారులంతా దీన్ని నిజమైన ఎన్‌కౌంటర్‌గా చూపడానికి తంటాలు పడుతున్నారు. సర్వత్రా వెల్లువెత్తుతున్న నిరసనను, ప్రజాక్రోశాన్ని చూసి కాంగ్రెస్ పార్టీ కూడా ఈ సంఘటనపై విచారణకు ఒక కమిటీని నియమించింది. 'చనిపోయిన వాళ్లలో మావోయిస్టుల కంటే సాధారణ ప్రజలే ఎక్కువగా వున్నార'ని అంటూ,

రమన్‌సింగ్ ప్రభుత్వం కేంద్రానికి తప్పుడు రిపోర్టు పంపిందని అది ప్రకటించి దీనిలో కేంద్ర ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదని నమ్మింపజూసింది. ఆ తర్వాత చిదంబరం 'ఇది పూర్తిగా పారదర్శకంగా జరిగిన దాడి' అని బొంకుతూనే 'ఇందులో ఎవరైనా నిర్దోషులు చనిపోయి వుంటే తాను అందుకు చింతిస్తున్నాన'ని చెప్పాడు. అయితే ఈ దాడి రాష్ట్ర బలగాల పథకంలో భాగంగానే జరిగింది కాబట్టి న్యాయ విచారణ జరపాలా వద్దా అని నిర్ణయించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని భుజాలు దులుపుకున్నాడు. ఇక రమన్‌సింగ్ ప్రభుత్వం గతంలో అనేక సార్లు ప్రకటించినట్టుగానే తూతూ మంత్రంగా హైకోర్టు న్యాయమూర్తి ద్వారా విచారణకు ఆదేశించింది. ఇలాంటి విచారణలతో ఒరిగేదేమీ లేదని, వీటితో దోషులకు శిక్షలు పడతాయని ఆశించడం ఎండమావిలో నీటిని వెదకడం లాంటిదేనని దేశ ప్రజలకు స్పష్టంగానే తెలుసు.

ఈ హత్యాకాండపై వస్తున్న నిరసనలపై స్పందిస్తూ ముఖ్యమంత్రి రమన్‌సింగ్ మావోయిస్టులు సాధారణ ప్రజలను మానవ కవచాలుగా వాడుకుంటున్నారని అంటూ ఈ ఫాసిస్టు హత్యాకాండను సమర్థించుకో చూశాడు. హోంమంత్రి ననకీరాం కంవర్ తన ఫాసిస్టు స్వభావాన్ని మరింత నగ్నంగా ప్రదర్శిస్తూ 'మావోయిస్టులతో కలిసే వాళ్లందరూ మావోయిస్టులే' అంటూ తమకు ఎవరినైనా చంపేసే అధికారం వున్నట్టు చెప్పకనే చెప్పాడు. కార్పొరేట్ వర్గాల అడుగులకు మడుగులొత్తే మీడియా మావోయిస్టులకు, ప్రభుత్వానికి మధ్య సాగుతున్న పోరులో ఆదివాసులు నలిగిపోతున్నారని పాత పాటే ఎత్తుకున్నది. ఇక్కడ మావోయిస్టులెవరో, కాని వాళ్లెవరో తేడా తెలియడం కష్టం కనుక రాత్రి పూట చీకట్లో ప్రభుత్వ సాయుధ బలగాలు పొరపాటున ఈ హత్యాకాండకు పాల్పడి వుండొచ్చుననే కథను మరి కొందరు అవకాశవాదులు ప్రచారం చేస్తున్నారు.

ముందే చెప్పినట్టు ఈ నరమేధం పాలకవర్గాలు ప్రజలపై సాగిస్తున్న యుద్ధంలో భాగమే. 2009 జనవరిలో జరిగిన సింగారం నరమేధం మొదలుకొని వెచ్చాపాడ్, సింగన్‌మడుగు, పాలచెలిమ, గోంపాడు, గుమియాపాల్, కోకవాడ, తాకిలోడ్, ఓంగ్‌నార్ తదితర అనేక చోట్లలో జరిగిన ఆదివాసుల సామూహిక హత్యాకాండల పరంపరకు కొనసాగింపే ఇది. 2005–07 మధ్య సాగిన సల్వాజుడుంలో కూడా ఇలాంటి హత్యాకాండలెన్నో సాగించిన చరిత్ర రమన్‌సింగ్ ప్రభుత్వానికి వుంది. సల్వాజుడుం పాల్పడ్డ 500కు పైగా హత్యలు, 99 లైంగిక అత్యాచారాలు, 103 దహనకాండలకు సంబంధించిన కేసులు సుప్రీంకోర్టులోనే నమోదయ్యాయంటే వాస్తవ విధ్వంసం ఏ స్థాయిలో వుంటుందో ఊహించవచ్చు. ఆదివాసులను హతమార్చి, తమ నివాస ప్రాంతాల నుండి తరిమికొట్టి ఇక్కడి ప్రకృతి సంపదలన్నిటినీ టాటా, ఎస్సార్, జిందల్, మిత్తల్, నెకో, రియో టింటో, డీ బీర్స్, బిహెచ్‌పి వంటి దళారీ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే కుట్రలో భాగమే ఈ హత్యాకాండలు.

2012 జూన్ నెలలో తాము ఒక పెద్ద వ్యూహాత్మక ఆపరేషన్ ప్రారంభించబోతున్నామని పోలీసు అధికారులు ఇటీవల పత్రికాముఖంగానే ప్రకటించారు. ఆదివాసుల అభివృద్ధి గురించి ఊదరగొడ్తూ ఫాసిస్టు ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు మానవ ముసుగును తొడగాలని వెర్రిగా ప్రయత్నిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి జయరాం రమేష్ ఇటీవలే సుక్మా జిల్లాను పర్యటించి వెళ్లాడు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆర్.కే. సింగ్ కూడా ఇటీవలే చింతల్‌నార్‌కు వచ్చి పోయాడు. సీఆర్‌పీఎఫ్ డీజీ విజయ్‌కుమార్ సుక్మా, చింతల్‌నార్‌లలో పర్యటించాడు. కనుక వీళ్లందరూ ఈ భారీ హత్యాకాండకు సూత్రధారులు. ఇది చిదంబరం, రమన్‌సింగ్‌ల నిర్ణయం ప్రకారమే కుట్రపూరితంగా జరిగిన హత్యాకాండ. అంతే తప్ప సాయుధ బలగాలు పొరపాటుగానో, తొందరపడో చేసిన ఆపరేషన్ కానే కాదు.

తాము చేస్తున్నది యుద్ధం కాదని, ఆపరేషన్ గ్రీన్‌హంట్ లాంటిది లేనే లేదని చిదంబరం, రమన్‌సింగ్‌లు బుకాయించినప్పటికీ గత మూడేళ్లుగా ప్రజలపై సాగుతున్నది అన్యాయమైన యుద్ధమే. ముఖ్యంగా దేశంలోని ఆదివాసీ ప్రాంతాలన్నీ అపార ఖనిజ, జల, వన సంపదలకు నిలయంగా వుండడం, వాటిని కొల్లగొట్టడానికి బడా పెట్టుబడిదార్లు, బహుళజాతి కంపెనీలు ఇక్కడి ప్రభుత్వాలతో అనేక లక్షల కోట్ల రూపాయల ఎంవోయూలు చేసుకోవడం విదితమే. ప్రత్యేకించి నేడు ప్రపంచవ్యాప్తంగా నెలకొని వున్న తీవ్ర ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో వెనుకబడిన దేశాల నుండి ప్రకృతి వనరుల్ని పెద్ద ఎత్తున కొల్లగొట్టడానికి, తద్వారా సంక్షోభం నుండి బైట పడడానికి బడా కార్పొరేట్ సంస్థలు విపరీతంగా పోటీ పడుతున్నాయి. ఇందుకోసం అవి భారత్ వంటి పేద దేశాల దళారీ పాలకులను సంపదల్ని త్వరగా దోచి పెట్టాలని వత్తిడి చేస్తున్నాయి. అయితే ప్రజలు, ముఖ్యంగా ఆదివాసులు, వాళ్లకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టులు ఈ నిలువుదోపిడీకి అతి పెద్ద అడ్డంకిగా వున్నారు. కాబట్టి దేశ పాలకులు కుట్రపూరితంగానే 'మావోయిస్టు ఉద్యమం దేశ ఆంతరంగిక భద్రతకు అతి పెద్ద ముప్పు' అనే ప్రచారాన్ని మొదలు పెట్టారు. దీని ముసుగులో తాము ఎంతటి దారుణ హత్యాకాండలకైనా ఒడిగట్టవచ్చని, తమ ఫాసిస్టు చర్యలన్నిటినీ సమర్థించుకోవచ్చని వాళ్లు భ్రమ పడుతున్నారు. సామూహిక హత్యాకాండలకు పాల్పడి, గ్రామాలను ఖాళీ చేయించి, ఆదివాసీ ప్రాంతాలన్నిటినీ మానవరహితం చేసి తమ విచ్చలవిడి దోపిడీకి ఎలాంటి అడ్డూ లేకుండా చేయాలనే సామ్రాజ్యవాద ప్రభువుల ఆదేశాల మేరకే భారీ, వినాశకర నిర్బంధ క్యాంపెయిన్లకు పూనుకుంటున్నారు. ఇందులో భాగమే ఇది.

తాము ప్రజాస్వామికంగా ఎన్నికయ్యామని, తమది ప్రపంచంలోనే అది పెద్ద ప్రజాస్వామ్యమని బుకాయిస్తున్న భారత పాలకవర్గాలు ఒకవైపు ప్రతి నిత్యం అత్యంత క్రూర, ఫాసిస్టు చర్యలకు, హత్యలకు, నరమేధాలకు పాల్పడుతూనే తమకు వంత పాడే మీడియా

సహకారంతో, తమ పాదసేవకు అంకితమైన కిరాయి మేధావుల అండతో వాటిని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ప్రజలను చంపుతూనే ప్రజా సేవకులం అని బుకాయిస్తున్నారు. తాము రాసుకున్న రాజ్యాంగాన్ని తామే ప్రతి నిత్యం ఉల్లంఘిస్తూనే రాజ్యాంగానికి బద్ధులం అని నమ్మింప జూస్తున్నారు. ప్రజలపై సాగిస్తున్న ఇలాంటి హత్యాకాండలకు, పాశవిక దాడులకు మరింత చట్టపరమైన రక్షణ కోసం ఎన్‌సీటీసీ వంటి క్రూర వ్యవస్థలను, మరిన్ని ఫాసిస్టు చట్టాలను రూపొందించడానికి త్వరపడుతున్నారు.

చౌకబారు రాజకీయ లబ్ధి కోసమే ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ ఈ హత్యాకాండను వ్యతిరేకిస్తున్నట్టు, దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నట్టు పోజు పెడుతున్నది. అలా అది తమ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం అండదండలతో, ప్రత్యేకించి చిదంబరం ప్రత్యక్ష పర్యవేక్షణలోనే ఈ హత్యాకాండ జరిగిందనే వాస్తవాన్ని మరుగుపర్చాలని చూస్తున్నది. పచ్చి అవకాశవాదానికి, నిర్లజ్జపూరిత వంచనకు ఇంతకన్నా వేరే ఉదాహరణ అక్కరలేదు.

ఈ దారుణ హత్యాకాండను ప్రతి ఒక్కరూ ఖండించాలని, దీనికి బాధ్యులైన చిదంబరం, రమన్‌సింగ్‌లు తక్షణమే పదవి లోంచి వైదొలగాలని డిమాండ్ చేయాల్సిందిగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు, విద్యార్థి–మేధావులకు, విప్లవ, ప్రజాస్వామిక, పౌరహక్కుల సంఘాలకు, ఆదివాసుల శ్రేయోభిలాషులకు, మీడియామిత్రులకు, దేశభక్తులందరికీ విజ్ఞప్తి చేస్తున్నది. చిదంబరం, రమన్‌సింగ్, ననకీరాం కంవర్, ఆర్.కే. సింగ్, విజయ్‌కుమార్, అనిల్ నవానీ, రామ్‌నివాస్, లాంగ్‌కుమేర్ సహా ఈ హత్యాకాండలో పాల్గొన్న అధికార్లను, జవాన్లను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయాలి. ఈ హత్యాకాండ జరిగిన గ్రామాలకు వచ్చి బాధిత ప్రజలను కలవాలని, వాస్తవాల్ని ప్రత్యక్షంగా తెలుసుకొని ప్రచారం చెయ్యాలని, దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సభలు, సమావేశాలు, ధర్నాలు, ప్రదర్శనలు చేపట్టి సమైక్య ఉద్యమాన్ని నిర్వహించాలని అందరినీ కోరుతున్నాం. భారత ప్రభుత్వం దేశ ప్రజలపై సాగిస్తున్న యుద్ధం – ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను తక్షణమే ఆపాలని, బస్తర్‌లో 'శిక్షణ' పేరుతో మోహరించిన భారత సైన్యాన్ని, అర్ధసైనిక బలగాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తమ తమ దేశాల్లో ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని ప్రపంచ దేశాల ప్రజాస్వామిక వాదులకు, విప్లవోద్యమ అభిమానులకు, మిత్రులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

Gudsa Usendi

**(గుడ్సా ఉసెండి)**

**అధికార ప్రతినిధి,**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**